క్లుప్తంగా

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆరాధ్య అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్‌కు చెందిన యేలేశ్వరపు ఉషామాధురి ఆధ్వర్యంలో భక్తి సంగీతాన్ని ఆలపించారు. సోమయాజులు ఉషామాధురి, సాయికీర్తన, కామాక్షి కాశ్యపి, రేయ నూతక్కి, కీర్తి కౌముది, సహస్ర శ్రీహిత పండరి, కాశీ విశ్వనాథ్, నాగశ్రీశ్రావ్య పలు కీర్తనలను ఆలపించారు. వీరికి మృదంగంపై కిశోర్, వయోలిన్‌పై శ్రీకృష్ణ చక్కటి సహకారం అందించారు. అనంతరం కళా బృందానికి ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

సాయిబాబా మందిరంలో హోమం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దక్షిణాయనం మార్గశిర మాస పౌర్ణమి సందర్భంగా భవానీపురం ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం లక్ష్మీగణపతి, నవగ్రహాలు, దత్తాత్రేయుడు, సాయిబాబాకు హోమం నిర్వహించారు. రుత్వికులు చిట్టాల సదాశివ శర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ హోమంలో ఉభయ దాతలతోపాటు భక్తులు పాల్గొన్నారు. భక్తులు భక్తి శ్రద్ధలతో హోమం చుట్టూ ప్రదక్షిణలు చేసి నమస్కరించారు. కార్యక్రమంలో మందిరం పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచేది చెస్



పటమట(విజయవాడతూర్పు): కఠినమైన శిక్షణ ఉంటే ఎలాంటి రంగంలోనైనా రాణించవచ్చని, విద్యార్థులకు వినోదంతో పాటు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచే ఆటల్లో చదరంగం ప్రధానమైనదని కేఎస్ఆర్ చెస్ అకాడమీ అధినేత, ప్రముఖ చెస్ కోచ్ సురేష్ అన్నారు. కరెన్సీనగర్‌లోని అకాడమీలో ఇంటర్ స్కూల్స్ చెస్ చాంపియన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో ప్రాచీన ఆటల్లో చెస్ ప్రధానమైనదని, ఇద్దరి మధ్య జరిగే చెస్ పోటీలు వ్యక్తిలో ఏకాగ్రత, చురుకుదనం, వ్యూహం, ఎత్తులకు పైఎత్తులు వేయటంలో రాజసం ఉంటుందన్నారు. చెస్‌లో గెలవాలంటే లక్ష్యం, వ్యూహం ప్రణాళికబద్ధంగా ఉండాలని ఇది నిజ జీవితంలో కూడా గెలిచేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఈ పోటీల్లో 6.5 పాయింట్లతో ఈశ్వర్ మొదటి స్థానం, వి. భువనేశ్వర్ ద్వితీయ స్థానం పొందారు. ఆరు పాయింట్లతో సాయి అమిత్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీసాయిబాబా, నాగమానసాదేవి ఆలయంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముక్కోటి దేవతల అవతారంగా భావించే దత్తాత్రేయుడి విగ్రహానికి భక్తులు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులైన త్రిమూర్తుల స్వరూపమే దత్తాత్రేయ స్వామి అని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి అన్నారు. అనంతరం వల్లభదాసు మాధవరావు, విజయలక్ష్మి దంపతులు, కనకమేడల భరత్‌భూషణ్, శివపార్వతి దంపతులు, వెన్నా రామాంజనేయులు, లక్ష్మీ రమాదేవి దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరూ పయనించాలని నజరేతు నాయక్ ప్రేయర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.ధర్మానాయక్ తెలిపారు. స్థానిక దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులో ఆదివారం సాయంత్రం నజరేతు నాయక్ ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన క్రీస్తు సందేశాన్ని వివరించారు. అనంతరం చిన్నారులు, మహిళలు ఆలపించిన భక్తి కీర్తనలు ఆహుతులను అలరించాయి.

ప్రారంభమైన క్రిస్మస్ సందడి

- జోరుగా క్రిస్మస్ ట్రీ, స్టార్స్ అమ్మకాలు
- ముస్తాబవుతున్న చర్చి ప్రాంగణాలు
- సందడిగా సెమీక్రిస్మస్ వేడుకలు



పాతబస్తీలోని పులిపాటివారివీధిలో క్రిస్మస్ సందర్భంగా జోరుగా అమ్మకాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకల సందడి ప్రారంభమైంది. ఏసుక్రీస్తు పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 25న జరుపుకోనున్న క్రిస్మస్ పండగ వేడుకలకు సంబంధించి మార్కెట్‌లో సందడి మొదలైంది. నగరంలో ప్రధానంగా పశ్చిమ నియోజకవర్గంలో 15రోజులు ముందుగానే క్రిస్మస్ వేడుకల సందడి దర్శనమిస్తుంది. పాతబస్తీలో తారాపేట, వించిపేట, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా...వన్‌టౌన్‌లోని ఏ దుకాణం చూసినా వివిధ రకాల స్టార్‌లు, శాంతాక్లాజ్ బొమ్మలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ఏసుక్రీస్తు పుట్టిన సందేశాన్ని చూపించే గుర్తుగా నక్షత్రాన్ని నాటి విశ్వాసులు చూపించడంతో పశ్చిమ నియోజకవర్గంలో క్రైస్తవ విశ్వాసుల ప్రతి ఇంటా క్రిస్మస్ స్టార్లు దర్శనమిస్తున్నాయి.

మార్కెట్‌లో విస్తృతంగా విక్రయాలు..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పాతబస్తీలోని వ్యాపార కేంద్రాలు, హోల్‌సేల్ మార్కెట్‌లో ఆయా వస్తువుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పాతబస్తీలోని పులిపాటి వారి వీధి, రాంగోపాల్‌వీధి, మెయిన్‌బజార్, భావనారాయణ వీధి, కందులవారివీధి తదితర ప్రాంతాల్లోని మార్కెట్లలో స్టార్స్, క్రిస్మస్ ట్రీ బొమ్మలు, శాంతాక్లాజ్ బొమ్మలు ఇలా వివిధ వస్తువులతోపాటుగా అలంకరణకు ఉపయోగించే సామగ్రి, బొమ్మలను సైతం విక్రయాలు చేస్తున్నారు.

ముస్తాబవుతున్న చర్చి ప్రాంగణాలు..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పాతబస్తీలోని ప్రధాన చర్చి ప్రాంగణాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. తారాపేటలోని సీఎస్‌ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి ప్రాంగణాలను ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ముచ్చటగొలిపే రంగులతో ఆయా ప్రాంగణాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. తెలుగు బాప్టిస్ట్ చర్చితోపాటు ఆయా చర్చి ప్రాంగణాలను సైతం నిర్వాహకులు వేడుకలకు సిద్ధం చేస్తున్నారు.

అంతటా సెమీక్రిస్మస్ సందడి..

ఈనెల 25వ తేదీ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ముందుగా నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలను ఆయా ప్రాంతాల్లో సందడిగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేసి ఆయా ప్రాంతాల్లో క్రీస్తు జన్మ వృత్తాంతాలను తెలిపే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలు సెమీ క్రిస్మస్ వేడుకలతో సందడిగా మారాయి.



ముచ్చటగొలుపుతున్న క్రిస్మస్ ట్రీ, స్టార్లు



ముస్తాబైన తారాపేట సీఎస్‌ఐ చర్చి ప్రాంగణం

జనవరి నాటికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం కావాలి : ఎమ్మెల్యే



మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయాలని, మాస్టర్ ప్లాన్ జనవరి నాటికి సిద్ధం చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి సూచించారు. దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై దుర్గగుడి ఈఈ వైకుంఠరావు, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ బి. పాండురంగారావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ శ్రీనివాసరావుతో ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆదివారం కానూరులోని క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన మార్పులు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే రెండుసార్లు మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించామని, జనవరి నాటికి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులు పూర్తి కావాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులను ఇప్పుడే గమనించి భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో పలువురు బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అమర వీరుల త్యాగాలు ఎనలేనివి



పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, ఏసీ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): దేశాన్ని ఏకీకృతం చేయటంలో విజయం సాధించిన సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావంలో తన ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగాలు ఎనలేనివని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం వీరిరువురి వర్ధంతి సందర్భంగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద పొట్టి శ్రీరాములు - సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు, ప్రాంతీయ భాషలు, సంస్కృతులను పరిరక్షించడంలో పొట్టి శ్రీరాములు పాత్ర కీలకమైనదన్నారు. ఆంధ్రుల ఆశయ సాధన కోసం ఆయన చేసిన త్యాగానికి ఆయన మరణాంతరం అమరజీవి అనే బిరుదు ప్రధానం చేశారని తెలిపారు. భారతదేశపు ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాకుండా దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాలను చేపట్టారన్నారు. ఇటువంటి మహనీయుల వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకోవటమే కాకుండా భావితరాలకు వారి గురించి తెలియజేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్)డాక్టర్ డి.చంద్రశేఖర్, మేనేజర్ ఏయూబీ శర్మ, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి అమరుడైన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నగరంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడై, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకు జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డాక్టర్ విద్యాసాగర్, సూపర్‌వైజర్లు రాజశేఖర్, సత్యనారాయణరెడ్డి, బాషా, తేజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తనభర్త 20రోజులుగా కనిపించడం లేదంటూ ఓ వివాహిత ఫిర్యాదు చేయడంతో కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..కొత్తపేట గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన దుర్గాసీ పురుషోత్తం, దుర్గాలావణ్య భార్యభర్తలు. వీరికి 15ఏళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు సంతానం. కుమారుడు హర్షవర్ధన్ రెండు నెలల కిందట మంచినీటికి బదులుగా యాసిడ్ తాగడంతో చికిత్స చేయిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో కొద్ది రోజుల కిందట పురుషోత్తం ఇంటినుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. 20రోజులు అవుతున్నా భర్త జాడ లేకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రెండు ఆటోలు ఢీకొనడంతో ఓ మహిళకు గాయాలైన ఘటన భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాపునకు చెందిన జె.లక్ష్మీవాసంతి గొల్లపూడిలోని ఓ దుకాణానికి వెళ్లింది. అక్కడ సరుకులు కొనుగోలు చేసి ఆటోలో తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్ సమీపంలో రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రక్ ఆటో ఆమె ప్రయాణిస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో లక్ష్మీవాసంతి ముఖం, తల, కుడిచేతికి గాయాలయ్యాయి. ఆమెను 108వాహనంలోని భవానీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని వైష్ణావాలయాల్లో ఈనెల 16వతేదీ సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ధనుర్మాస ఉత్సవాలకు నగరంలోని వైష్ణావాలయాలన్ని ముస్తాబవుతున్నాయి. నగరంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న పురాతన ఆలయమైన శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంతోపాటుగా పాతబస్తీలోని పలు కోదండరామాలయాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రోజూ ప్రత్యేక వైధిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం ధనుర్మాస వ్రతం(నెలగంట)తో ఉత్సవాలు ప్రారంభమై, వచ్చే జనవరి 14వ తేదీ వరకూ కొనసాగుతాయని వారు వివరించారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనంతోపాటు ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు, తోమాల సేవలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదేవిధంగా జనవరి 11న స్వామివారికి కుడారై ఉత్సవం, 13న గోదా అమ్మవారి కల్యాణంతో ధనుర్మాసోత్సవాలు ముగియనున్నాయి.

కృష్ణంరాజు విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులో ప్రముఖ సినీనటుడు కృష్ణంరాజు విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కృష్ణంరాజు సతీమణి శ్యామలదేవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముత్యాలంపాడులో కృష్ణంరాజు విగ్రహం ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చిన సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ సభ్యులను అభినందించారు. ఎమ్మెల్యే బోండా ఉమా సహకారంతో ముత్యాలంపాడులో కృష్ణంరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు డి.మురళీకృష్ణం రాజు తెలిపారు. కార్యక్రమంలో వేజెళ్ల రాజేంద్రప్రసాద్, అప్పలరాజు, కనకారావు, నున్న నాగేశ్వరరావు, చంటి, రమణ, అభినమానులు తదితరులు పాల్గొన్నారు.

శృతిలయ సమ్మేళనం రామమూర్తి గాత్రం



కచేరీ నిర్వహిస్తున్న రామమూర్తి

విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ కళా పీఠం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఎస్.రామమూర్తి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ వాగ్గేయకారులకు సంకీర్తనా గుడికట్టింది. సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కొమ్మా జోస్యుల సద్గురు చరణ్ వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ సంగీత కచేరీ నిర్వహించిన రామమూర్తి సంగీత సేవలను వివరిస్తూ వృత్తిరీత్యా చార్టర్ అకౌంటెంట్ అని, చిన్నతనం నుంచే సంగీతంలో శిక్షణ తీసుకున్నారన్నారు. దేశ విదేశాల్లో కచేరీలు నిర్వహించారని తెలిపారు. సంస్థ కార్యదర్శి సీవీ రావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంగీత విద్వాంసుడు రామమూర్తిని ఆత్మీయంగా సత్కరించారు.

వైభవంగా వెంకన్నకు గరుడ సేవ



గరుడ వాహనంపై కొలువుదీరిన వెంకన్న

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకొని వెంకన్నస్వామికి గరుడసేవ ఉత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మార్గశిర మాస పౌర్ణమిని పురస్కరించుకొని పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో గరుడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైధిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతినెల పౌర్ణమి రోజున స్వామి వారికి గరుడ వాహన సేవను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గరుడవాహనంపై వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. సహస్రనామార్చనలు చేశారు. భక్తుల గోవింద నామాలు, మంగళవాయిద్యాలు, పండితుల వేదపఠనం, కళాకారుల నృత్యాలతో స్వామివారి గరుడ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారిని ఆలయ ప్రాంగణంలో మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

ఆలయంలో ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు తిరుమంజన అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాలు, సుగంధ ఫలపుష్పాది ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్ని పూజలు చేశారు. వైధిక కార్యక్రమాలను ఆలయ పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షితేలు నిర్వహించారు.

నిత్య స్మరణీయుడు పొట్టి శ్రీరాములు

ఎంపీ కేశినేని శివనాథ్



సభలో మాట్లాడుతున్న కేశినేని శివనాథ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆత్మ బలిదానం చేసిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ప్రభుత్వం నిర్వహించిన పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం, సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు తనప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు నిత్య స్మరణీయుడని పేర్కొన్నారు. ఆంధ్రుల ఉద్యమ శక్తి, పట్టుదల, సంకల్ప దీక్ష దశదిశలా చాటి చెప్పిన గాంధేయవాది పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన పోరాట పటిమ నేటితరానికి ఆదర్శనీయమని సూచించారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చంనాయుడు, కొలుసు పార్థసారధి, పీ నారాయణ, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఎంసీ హైస్కూల్‌లో..



విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం జ్యోతిర్మయి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతోనే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (డీఎస్ఎంసీ) ఇన్‌చార్జ్ హెచ్ఎం కరుణాకరం జ్యోతిర్మయి కొనియాడారు. విద్యాధరపురంలోని డీఎస్ఎంసీ హైస్కూల్‌లో ఆదివారం పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దీక్షా పటిమే తెలుగువారికి ప్రత్యేక రాష్ట్ర సాధనకు కారణమైందన్నారు. ఆయన త్యాగం, అకుంఠిత దీక్ష నేటి తరానికి స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేసిన ఈ రోజును ఆత్మార్పణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు. అదేవిధంగా మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

పొట్టి శ్రీరాములుకు ఘననివాళి..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు తెలుగుజాతికి అందించిన సేవలు అపూర్వమని ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నున్న త్రిమూర్తిచౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కొనకళ్ల విద్యాధరరావు, పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్రం కోసం చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు.కార్యక్రమంలో నాయకులు మద్దు బాలు, శెగు వెంకటేశ్వరరావు, కోట సుదర్శన్, రంగారావు, కొల్లిపర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సామారంగం చౌక్ సెంటర్‌లో...

స్థానిక సామారంగంచౌక్ సెంటర్‌లో వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు, మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కొనకళ్ల విద్యాధరరావు తదితరులు



నివాళులర్పిస్తున్న వీవీకే, నూకల తదితరులు

వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ ఆడిటర్, సమీర ఈస్ట్ లయన్స్ కంటి హాస్పిటల్ ట్రస్ట్ సభ్యుడు పి.సుబ్బారాయుడు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 210 నెలలుగా వయోవృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయం అందజేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ బి.హనుమయ్య మాట్లాడుతూ తాము ఇప్పటికే వేలాది మందికి లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ద్వారా కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేశామన్నారు. ఇప్పుడు వృద్ధులకు కూడా సేవ చేయటం సంతోషంగా ఉందని చెప్పారు. వయో వృద్ధ చారిటబుల్ ట్రస్ట్‌లో వృద్ధులకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షులు పీవీడీ ప్రసాద్, డి.గోపీనాథ్ మాట్లాడారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్‌సోలంకీ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం వృద్ధులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టీలు తట్టి అర్జునరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com